

రిమ్స్ ఘటనలో మరో ఇద్దరు శిశువులు మృతి


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..








సంపుటి - 3 సంచిక -104 గురువారం 24 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ఎనిమిదేళ్ల ఆయుష్మాన్ భారత్..

**కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్ల ఆదా**



- ఆయుష్మాన్ భారత్ పథకానికి ఎనిమిదేళ్లు పూర్తి
- 60 కోట్ల మందికి రూ. 5 లక్షల వార్షిక ఆరోగ్య రక్షణ
- దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఏర్పాటు
- ఈ నెట్‌వర్క్‌లో 38,000కు పైగా ఆసుపత్రులు భాగం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విజయవంతంగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం స్పందిస్తూ.. మిగతా 2లో...

# విద్యుదుత్పత్తి ఆగడానికి వీల్లేదు

## ఎత్తిపోతలకు ఆటంకాల్లేకుండా విద్యుత్తు

- సాగు అవసరాలకూ నిరాటంకంగా సరఫరా
- దసరాలోపు 'యాదాద్రి'లో పూర్తిస్థాయి ఉత్పత్తి
- రాష్ట్రంలో జీ-9 రకం బొగ్గు లభించనప్పుడు ఆ సాంకేతికతో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఎందుకు డిజైన్ చేసినట్టు?
- మహానది కోల్‌ఫీల్డ్ నుంచి బొగ్గు కొనుగోలు, లింకేజీ కోసం కేంద్రంతో చర్చలు జరపండి
- విద్యుత్తుశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్



**హైదరాబాద్, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ వార్త):** ప్రస్తుతం రాష్ట్ర అవసరాలకు తగినట్లుగా విద్యుత్తును కొనుగోలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎత్తిపోతల పథకాలకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయానికి అందిస్తున్న విద్యుతు సరఫరాలోనూ ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని నొక్కి చెప్పారు. బొగ్గు కొరత కారణంగా రాష్ట్రంలో విద్యుదుత్పత్తి ఆగడానికి వీల్లేదని, బయట నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని పవర్ ప్లాంట్లలో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తికి మిగతా 2లో...

## ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

**విస్తృత ధర్మాసనానికి పంపడంపై ఇద్దరు న్యాయమూర్తుల మధ్య విభేదం**

**రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుపై సీజేఐకి సిఫారసు**




**న్యూఢిల్లీ సెప్టెంబర్23 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం భిన్న తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న కేంద్ర మిగతా 2లో...

## కొత్త ఇంచార్జ్‌లు

- 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం
- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్ -ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి




**న్యూఢిల్లీ సెప్టెంబర్23, (జర్నలిస్ట్ వార్త):** రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయమిగతా 2లో...




## జూరాలకు నీటి విడుదలకు ఓకే

- జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం
- విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత
- బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ
- జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు జూపల్లి, శ్రీహరి

**హైదరాబాద్ సెప్టెంబర్23 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మిగతా 2లో...


## రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల దుర్మరణం

- శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఘోర రైలు ప్రమాదం
- భారీ వర్షం కారణంగా రైలు రాకను గమనించలేకపోయిన విద్యార్థులు
- పట్టాల సమీపంలో చేపలు పడుతుండగా జరిగిన దుర్ఘటన
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు..



## వాయుగుండం ముప్పు

- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరం వైపు వేగంగా పయనం
- కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం
- విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుందని అంచనా
- తీర ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తం



**అమరావతి (జర్నలిస్ట్ వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తరాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం, రాగల కొన్ని గంటల్లో తీరాన్ని తాకనుంది. బుధవారం రాత్రి ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. మిగతా 2లో...

## డీఎస్సీ మెగా స్కామ్..

## సీబీఐ విచారణ జరిపించండి

**గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కిజగన్ ఫిర్యాదు**



**అమరావతి, (జర్నలిస్ట్ వార్త):** డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు.

గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా మిగతా 2లో...

## తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం



## కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

- బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మూత
- జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరాతో రూ.2,900 కోట్ల నష్టం
- నేడు పవర్‌ప్లాంట్ల సందర్శన : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే కరెంటు కోతలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపేస్తున్నారని అన్నారు. నీటి కొరత వల్ల జల విద్యుత్ కేంద్రాలు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కేంద్రాల వద్ద వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం ఆరు బీఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన మిగతా 2లో...



# కొత్త ఇంచార్జ్‌లు

**మొదటి పేజీ తరువాయి**

అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ–ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

**ఆంధ్రప్రదేశ్:** అర్విండ్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ–ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా,



కో–ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.

**ఒడిశా:** దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ–ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

**కర్ణాటక:** హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ–ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

**ఉత్తర ప్రదేశ్:** దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ–ఇంచార్జ్‌లను కేటాయించారు.

**మహారాష్ట్ర:** బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ–ఇంచార్జ్‌లుగా నియమించారు.

**ఛత్తీస్‌గఢ్ - హర్యానా:** మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

**ఢిల్లీ:** డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో–ఇంచార్జ్‌లుగా నియమించారు.

**గుజరాత్:** తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

**హిమాచల్ ప్రదేశ్:** శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

**మధ్యప్రదేశ్:** మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# ఎనిమిదేళ్ల ఆయుష్మాన్ భారత్..

**మొదటి పేజీ తరువాయి**

ప్రతి భారతీయుడికి నాణ్యమైన, అందుబాటు ధరలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఈ పథకం ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంగా నిలిచిందని ఆయన కొనియాడారు.

ఈ విషయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "ఎనిమిదేళ్ల క్రితం, ప్రతి భారతీయుడికి అత్యుత్తమ, అందుబాటు ధరలో వైద్యం అందాలనే ఆలోచనతో ఆయుష్మాన్ భారత్ ప్రారంభమైంది. ఈ రోజు, 60 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఏటా రూ. 5 లక్షల ఆరోగ్య కవరేజీ అందుబాటులో ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం" అని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు రికార్డు స్థాయిలో ఆదా అవుతున్నాయని ప్రధాని తెలిపారు. అంతేగాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజల ముంగిటకే చేరుతున్నాయని, ఇప్పటికే ఈ కేంద్రాల్లో 500 కోట్లకు పైగా సందర్శనలు నమోదయ్యాయని ప్రధాని వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ బలపడుతోందని ఆయన అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఎనిమిదేళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను MyGovIndia కూడా తన పోస్టులో వివరించింది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం–జేఏవై) కింద అందించిన ఉచిత చికిత్సల వల్ల కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్లకు పైగా వైద్య ఖర్చులు ఆదా అయ్యాయని తెలిపింది. దేశవ్యాప్తంగా 38,000కు పైగా ఆసుపత్రులు ఈ నెట్‌వర్క్‌లో భాగమయ్యాయని, ఇప్పటివరకు 13 కోట్లకు పైగా హాస్పిటల్ అడ్మిషన్లు జరిగాయని పేర్కొంది.

70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లను వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. మొత్తం ఆయుష్మాన్ కార్డుల్లో దాదాపు సగం మహిళల పేరు మీద ఉండటం గమనార్హం.

ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా మధుమేహం, రక్తపోటు కోసం 42 కోట్లకు పైగా స్క్రీనింగ్‌లు, అలాగే నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల కోసం కోట్ల సంఖ్యలో పరీక్షలు నిర్వహించారు.

ఈ పథకం పోర్టబిలిటీ సదుపాయం ద్వారా లబ్ధిదారులు తమ సొంత రాష్ట్రం వెలుపల కూడా రూ. 8,800 కోట్లకు పైగా విలువైన 30 లక్షలకు పైగా చికిత్సలు పొందారని పీఏ+శీజ×అఎఖు వెల్లడించింది. మొత్తంగా, 60 కోట్ల మందికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా అందిస్తూ, తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఈ పథకం ఆర్థిక భద్రతను కల్పిస్తోంది.

# విద్యుదుత్పత్తి ఆగడానికి వీల్లేదు

**మొదటి పేజీ తరువాయి**

చర్యలు తీసుకోవాలని సూచించారు.

జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో విద్యుత్తు శాఖపై రేవంత్ సమీక్ష నిర్వహించారు. దసరాలోపు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని అన్ని యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ఒడిసాలోని మహానది కోల్‌ఫీల్డ్ నుంచి పొందడానికి వీలుగా, లింకేజీ కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ, కోల్ ఇండియాతో సంప్రదింపులు జరపాలని నిర్దేశించారు. యాదాద్రిలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరగకపోవడానికి కారణాలపై ఆరా తీశారు. అయితే యాదాద్రిలోని యూనిట్లన్నీ కూడా జీ–9 రకం బొగ్గును మండించడానికి వీలుగా డిజైన్ చేసినవేనని, సింగరేణిలో జీ–9 రకం బొగ్గు లభించదని సీఎం అధికారులు నివేదించారు. రాష్ట్రంలో జీ–9 రకం బొగ్గు లభించకపోతే ఆ సాంకేతికతతో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం ఎలా చేపట్టారని సీఎం ప్రశ్నించారు.

దీనికి అధికారులు వివరణ ఇస్తూ.. ప్లాంట్‌కు అనుమతి పొందే క్రమంలో విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటామని అనుమతులు తెచ్చుకున్నట్లు చెప్పారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ పర్యావరణ అనుమతులు సస్పెండయ్యాక సింగరేణి నుంచి బొగ్గు తెచ్చుకుంటామని కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖకు నివేదించడం జరిగిందని వారు చెప్పారు. సాధారణంగా థర్మల్ ప్లాంట్‌లన్నీ బొగ్గు గనుల పిట్‌హెడ్‌లో కట్టాలని కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) మార్గదర్శకాలు ఉన్నాయని, యాదాద్రికి 270 నుంచి 300 కి.మీ దూరంలో బొగ్గు బ్లాకులు ఉన్నాయని అధికారులు వివరించారు. సుదూర ప్రాంతం నుంచి బొగ్గును యాదాద్రికి తరలించడం వల్ల రానున్న 25 ఏళ్లలో రూ.40 వేల కోట్ల అదనపు భారం ప్రజలపై పడనుందని తెలిపారు. సింగరేణిలోని ఏ బ్లాకులో కూడా జీ–9 రకం బొగ్గు లేదని సింగరేణి అధికారులు వివరించారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్లే జీ–9 రకం బొగ్గును సరఫరా చేయలేకపోతున్నామని చెప్పారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు తెలిపారు. కాగా సాగు అవసరాల కోసం సోలార్ విద్యుదుత్పాదన జరుగుతున్న సమయంలోనే కరెంటు అందించాలని కేంద్ర ప్రభుత్వం డిస్కమ్‌లకు ఆదేశాలు ఇచ్చిందని సీఎంకు అధికారులు వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోలార్ అవర్‌లలోని వ్యవసాయానికి విద్యుత్తు అందించాలని కేంద్రం మార్గదర్శకాలు ఉన్నాయని నివేదించారు. కాగా రైతు డిస్కమ్ ఏర్పాటు ప్రక్రియపై కూడా అధికారులను ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈఆర్‌సీ లైసెన్స్ ఇచ్చినందున ఎప్పట్లోగా రైతు డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణ మే లాంఛనాలన్నీ పూర్తి చేసి, రైతు డిస్కమ్ కార్యకలాపాలు ప్రారంభించాలని ఆదేశించారు.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

**మొదటి పేజీ తరువాయి**

కార్యాలయాన్ని సందర్శించనున్నాయని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదనీ, జీవనరేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు.

**'ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో'**

విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావం కారణం కాదనీ, ఎల్ కాంగో (కాంగ్రెస్) ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని అన్నారు.

**సింగరేణితో సర్కార్ ఫుట్‌బాల్**

సింగరేణి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ అన్నారు. సింగరేణితో కార్మికులు, రైతులు, ప్రజలు ఆటలాడే పరిస్థితి రావొద్దని కోరారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమాలు, సోలార్ పవర్ టెండర్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023–24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025–26లో 58 మిలియన్ టన్నులకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు.

**వ్యవసాయానికి ఆరు గంటల కరెంటు**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదని కేటీఆర్ ఆరోపించారు.

**కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు**

'కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంటు ఉండదని కేటీఆర్ అన్నారు. అదే ఇప్పుడు నిజమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లను సందర్శిస్తాయని చెప్పారు.

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చెన్నూరు నియోజకవర్గం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌ల బృందం సందర్శిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పరిశీలిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు తాటికొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎ జీవన్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

**ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత**

**ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు**

**నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

# రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల దుర్మరణం

## శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఘోర రైలు ప్రమాదం

**టెక్కలి సెప్టెంబర్23 (జర్నలిస్ట్ వార్త):**

శ్రీకాకుళం జిల్లాలో శనివారం అత్యంత విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. టెక్కలి సమీపంలో రైలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదంతో స్థానికంగా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు టెక్కలి మండలం రావివలస వద్ద రైలు పట్టాల సమీపంలో వర్షపు నీరు భారీగా వచ్చి చేరింది. ఈ నీటిలో చేపలు పట్టేందుకు ఐదుగురు విద్యార్థులు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వారు పట్టాలు దాటుతుండగా, అదే సమయంలో భువనేశ్వర్ నుంచి గుణుపూర్ వెళుతున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొట్టింది. కురుస్తున్న భారీ వర్షం, వీస్తున్న బలమైన ఈదురు గాలుల కారణంగా వెనుక నుంచి వస్తున్న రైలు శబ్దాన్ని విద్యార్థులు గమనించలేకపోయారు. ఈ ప్రమాదంలో విశాఖ రావు, దిలీప్, శరత్, శివ అనే నలుగురు విద్యార్థులు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సాల్మన్ రాజు అనే మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం వెంటనే టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మృతులంతా టెక్కలి మండలం దమరు గ్రామానికి చెందిన వారని, టెక్కలిలోని ప్రభుత్వ ఎస్సీ/ఎస్టీ వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నారని అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందడంతో బాధితుల కుటుంబాల్లోను, గ్రామంలోనూ రోదనలు మిన్నంటాయి.

# జూరాలకు నీటి విడుదలకు ఓకే

**మొదటి పేజీ తరువాయి**

రైతులకు భారీ ఊరట లభించినట్లయింది.

ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వాయుగుండం ముప్పు

**మొదటి పేజీ తరువాయి**

ఈ పరిణామంతో కోస్తా ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

ప్రస్తుతం ఈ వాయుగుండం గత ఆరు గంటలుగా గంటకు 5 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది. ఇది కళింగపట్నానికి ఆగ్నేయంగా 50 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి 120 కిలోమీటర్ల దూరంలో, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 150 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. పూరీకి ఇది 250 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ–వాయవ్య దిశగా ప్రయాణించి, ఈ రోజు రాత్రి 8:30 నుంచి 11:30 గంటల మధ్య విశాఖపట్నం – గోపాల్‌పూర్ మధ్య తీరం దాటనుంది. ముఖ్యంగా కళింగపట్నానికి అత్యంత సమీపంలో ఇది భూభాగాన్ని తాకుతుందని అధికారులు స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో కూడా ఇది తీవ్ర వాయుగుండంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలోని తీర ప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బలమైన ఈదురు గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని, తీర ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధం చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్ (జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

## డీఎస్సీ మెగా స్కామ్..సీబీఐ విచారణ జరిపించండి

**మొదటి పేజీ తరువాయి**

జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు. ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వ అభ్యర్థనపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో కేసును తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి వచ్చారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలో సీఈసీ, ఈసీల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చారు. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. ఈ మార్పునే పిటిషనర్లు సవాల్ చేశారు.

# ఐలమ్మ కుటుంబానికి అండగా మంత్రి పొన్నం ప్రభాకర్

**మృతురాలి చిత్రపటానికి నివాళులు.. కుటుంబ సభ్యులకు పరామర్శ**



**భీమదేవరపల్లి/సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్దమల్ల వెంకటేష్ తల్లి ఐలమ్మ ఇటీవల మృతి చెందడంతో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. కొత్తకొండలోని ఐలమ్మ నివాసానికి వెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ఐలమ్మ మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, కేతిరి లక్ష్మారెడ్డి, అశోక్ ముఖర్జీ, పిడిశెట్టి కనుకయ్య, యాటపోలు శ్రీనివాస్, కంకల సమ్మయ్య, సిద్దమల్ల రాజమౌళి, జోడుముంతల వెంకటస్వామి, పుదరి రవీందర్, చింత రాజు, ఉపసర్పంచ్ యాదగిరి, వార్డు సభ్యులు శ్రీను, కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల నడుమ గణనాథునికి ఘన వీడ్కోలు



**కేసముద్రం/సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు కట్టు కాలువ తండాలో మహాదేవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి తండా ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుని ఊరేగింపు చేపట్టారు. యువత నృత్యాలు, భజనలతో సందడి చేయగా.. భక్తులు జై గణేశ్ నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు.
ఈ కార్యక్రమంలో బానోత్ యాకుబ్ నాయక్‌తో పాటు మహాదేవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిమజ్జన వేడుకలను విజయవంతం చేశారు.

# మాటకు పదును పెడితే మనసుకు గాయం తప్పదు

**చేతి దెబ్బ మానిపోవచ్చు కానీ మాట దెబ్బ మాత్రం జీవితాంతం వెంటాడొచ్చు**

మనిషి జీవితంలో మాటకు ఉన్న శక్తి అపారమైనది మాటతో మనిషిని గెలవొచ్చు మాటతో మనసును మార్చొచ్చు మాటతో బంధాన్ని బలపరచొచ్చు అదే మాటను విచక్షణ లేకుండా ఉపయోగిస్తే ఉన్న బంధాలను తెంచేయొచ్చు చేతితో కొట్టిన దెబ్బ శరీరంపై గాయం చేస్తుంది కొంతకాలానికి ఆ గాయం మానిపోతుంది కానీ మనసును గాయపరిచే మాట మాత్రం కనిపించని గాయంగా మిగిలిపోతుంది అందుకే మాట తూటా కంటే పదునైనది అంటారు

**కోపంలో వచ్చిన మాటే ఎక్కువ నష్టం**

కోపం మనిషి ఆలోచనా శక్తిని క్షణకాలం కమ్మేస్తుంది ఆ సమయంలో నోటికి వచ్చిన మాటను ఆలోచించకుండా చెప్పేస్తాం ఆ తర్వాత పరిస్థితి చల్లబడినప్పుడు అలా ఎందుకు మాట్లాడాను అని బాధపడతాం కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది క్షమాపణ చెప్పినా ఎదుటివారి మనసులో పడిన ముద్ర ఒక్కసారిగా చెరిగిపోదు
మనిషి కోపంలో అన్న మాటను తాను మరిచిపోవచ్చు కానీ ఆ మాట విన్న వ్యక్తి మాత్రం దాన్ని మరిచిపోకపోవచ్చు ముఖ్యంగా కుటుంబ సభ్యులు జీవిత భాగస్వాములు తల్లిదండ్రులు పిల్లలు స్నేహితుల మధ్య పలికే కఠినమైన మాటలు సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి

**కత్తి గాయం కన్నా మాట గాయం లోతైనది**

కత్తితో గాయం చేస్తే దానికి మందు వేయొచ్చు వైద్యం చేయించుకోవచ్చు కాలక్రమంలో ఆ గాయం మానిపోవచ్చు కానీ మనసుకు తగిలిన మాటల గాయానికి మందు ఉండదు ఎవరైనా మన బలహీనతను మన లోపాన్ని మన ఆత్మగౌరవాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడితే ఆ మాట మనసులో పదిలంగా నిలిచిపోతుంది ఒక వ్యక్తి జీవితంలో ఎన్నో మంచి మాటలు విన్నా ఒక అవమానకరమైన మాట మాత్రం పదేపదే గుర్తుకు రావచ్చు అందుకే ఎదుటివారిని విమర్శించే ముందు మన మాట వల్ల వారి ఆత్మగౌరవం దెబ్బతింటుందా లేదా అని ఆలోచించాలి

**మాటకు ముందు ఆలోచన అవసరం**

మాట్లాడటం అందరికీ వస్తుంది కానీ ఎప్పుడు మాట్లాడాలి ఏం మాట్లాడాలి ఎంతవరకు మాట్లాడాలి ఎక్కడ ఆగాలి అన్నది తెలుసుకోవడం గొప్ప లక్షణం మనం మాట్లాడే ప్రతి మాటకు ఒక ప్రభావం ఉంటుంది అది ఎదుటివారికి ధైర్యం ఇవ్వొచ్చు లేదా నిరాశకు గురిచేయొచ్చు
పరిస్థితి అదుపులో లేనప్పుడు వెంటనే స్పందించడం కంటే కాసేపు మౌనంగా ఉండటం మంచిది మనసు ప్రశాంతమైన తర్వాత మాట్లాడితే సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుంది

**కుటుంబాల్లో మాటలే కీలకం**

ఈ రోజుల్లో చిన్న చిన్న విషయాలకే కుటుంబాల్లో గొడవలు జరుగుతున్నాయి ఆర్థిక సమస్యలు పిల్లల చదువులు ఉద్యోగం ఆస్తి వివాదాలు అత్తమామలు అన్నదమ్ముల మధ్య విభేదాలు ఇలా కారణాలు ఏవైనా కావచ్చు కానీ చాలా సందర్భాల్లో సమస్యను పెద్దదిగా




చేసేది మాట తీరుఒకే విషయాన్ని ప్రేమగా చెప్పవచ్చు అదే విషయాన్ని అవమానించేలా కూడా చెప్పవచ్చు తేడా మాటల్లోనే ఉంటుంది ఎదుటివారిని గౌరవిస్తూ చెప్పిన మాట సమస్యను పరిష్కరించవచ్చు అహంకారంతో చెప్పిన మాట సమస్యను మరింత పెంచవచ్చు

**పిల్లల ముందు మాటలకు మరింత జాగ్రత్త**

తల్లిదండ్రులు పిల్లల ముందు మాట్లాడే మాటలకు మరింత బాధ్యత అవసరం పిల్లలను పదేపదే తక్కువ చేసి మాట్లాడటం ఇతరులతో పోల్చడం అవమానించడం వారి ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపుతుంది అదే పిల్లల తప్పులను సరిదిద్దేటప్పుడు ప్రేమతో అర్థమయ్యేలా చెప్పడం వారికి మార్గనిర్దేశం చేస్తుంది
నువ్వు చేయలేవు అనే మాటకు బదులు మరోసారి ప్రయత్నించు తప్పకుండా సాధించగలవు అని చెప్పే మాట ఒక జీవితాన్ని మార్చగలదు

**సామాజిక మాధ్యమాల్లోనూ ఇదే బాధ్యత**

ప్రస్తుతం సామాజిక మాధ్యమాల ప్రభావం విపరీతంగా పెరిగింది ఎదురుగా వ్యక్తి కనిపించకపోవడంతో కొందరు ఏదైనా రాసేస్తున్నారు వ్యాఖ్యలు సందేశాలు విమర్శల్లో హద్దులు దాటుతున్నారు ఒకసారి రాసిన మాటను తొలగించినా అది చదివిన వ్యక్తి మనసులో మిగిలిన బాధను తొలగించడం సాధ్యం కాదుఅందుకే సామాజిక మాధ్యమాల్లోనూ బాధ్యతగా వ్యవహరించాలి అభిప్రాయం చెప్పడం తప్పు కాదు కానీ వ్యక్తిగత దూషణలు అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం సంబంధాలను దెబ్బతీస్తుంది

**మాట మనిషి వ్యక్తిత్వానికి అద్దం**

మనిషి ఎలా ఆలోచిస్తాడో అతని మాటల్లో కనిపిస్తుంది సంస్కారం ఉన్న వ్యక్తి ఎదుటివారితో విభేదించినా గౌరవంగా మాట్లాడతాడు అహంకారం ఉన్న వ్యక్తి చిన్న విషయానికే అవమానకరమైన పదాలు ఉపయోగిస్తాడు అందుకే మన మాట మన వ్యక్తిత్వానికి అద్దం లాంటిది
ఎదుటివారిని గెలవడం కంటే వారి మనసును గెలవడం గొప్పది వాదనలో మనమే గెలిచినా మన మాటల వల్ల ఒక మంచి సంబంధాన్ని కోల్పోతే ఆ విజయం ఎందుకు ఒక క్షణం వాదనలో గెలిచి జీవితాంతం ఒక మనిషిని దూరం చేసుకోవడం కంటే ఒక అడుగు వెనక్కి తగ్గి సంబంధాన్ని కాపాడుకోవడం ఎంతో విలువైనది

**మాటకు హద్దు మనసుకు విలువ**

జీవితం చాలా చిన్నది మన చుట్టూ ఉన్న మనుషులు ఎప్పటికీ మనతో ఉండరు అందుకే ఉన్నంతకాలం ప్రేమగా మాట్లాడాలి బాధలో ఉన్నవారికి ఓదార్పు ఇవ్వాలి తప్పు చేసినవారికి దారి చూపాలి మనసు విరిగినవారికి ధైర్యం చెప్పాలిఒక్క మంచి మాట ఒక మనిషికి జీవితాంతం గుర్తుండిపోవచ్చు ఒక్క చెడు మాట ఒక మనిషిని జీవితాంతం బాధపెట్టవచ్చు
కాబట్టి మాట పలికే ముందు ఒకసారి ఆలోచిద్దాం కోపంలో మౌనాన్ని ఎంచుకుందాం విమర్శించాల్సి వస్తే గౌరవంగా మాట్లాడుదాం మన మాటతో ఎదుటివారి మనసు విరగకుండా వారి మనసుకు ధైర్యం కలిగేలా మాట్లాడుదాంచేతి దెబ్బకు కాలం మందు కావచ్చు మాట దెబ్బకు మాత్రం మనసే మందు కావాలి అందుకే మాటను జాగ్రత్తగా వాడాలి ఎందుకంటే నోటి నుంచి జారిన మాటను వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదు



**సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)**
**టి యు డబ్ల్యూ జే ( iju) జిల్లా కార్యవర్గ సభ్యులు 9908401581**

# పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు.. వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో గట్టి హెచ్చరిక

**చిన్నారులందరికీ టీకాలు పూర్తి చేయాలి.. నిమజ్జన వేళ వైద్య శిబిరాలు సిద్ధంగా ఉంచాలి**




**మహబూబాబాద్/ సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ బుధవారం గంగారం, గూడూరు మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల్లో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు.
ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనపై సంబంధిత వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా 05 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
సీజనల్ వ్యాధుల దృష్ట్యా అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, ఇతర వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.
అలాగే జిల్లాలో జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను డీఎంహెచ్‌వో పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన వైద్య సిబ్బంది,



మందులు, అత్యవసర వైద్య సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో గంగారం వైద్యాధికారి డాక్టర్ కిరణ్, గూడూరు వైద్యాధికారి డాక్టర్ పవన్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చిరుధాన్యాలు, ఆకుకూరలతో ఆరోగ్యం పదిలం

**అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం**




**కేసముద్రం/ సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** భూక్యా రాం తండా కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ దుర్గ మాట్లాడుతూ గ్రామాల్లో సులభంగా లభించే చిరుధాన్యాలతో వివిధ రకాల పోషక విలువలున్న వంటకాలను తయారు చేసుకుని తీసుకోవడం ద్వారా పిల్లలు, తల్లులు, పెద్దలు ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఆహారంలో ఆకుకూరలను విరివిగా చేర్చుకోవడం వల్ల రక్తహీనతను నివారించడంతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సర్పంచ్ సోమీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని కోరారు. పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దుర్గ, సర్పంచ్ సోమీ, ఆశా కార్యకర్త కవిత, అంగన్వాడీ టీచర్ సలీమా, వార్డు సభ్యురాలు లక్ష్మి, గ్రామ తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యలు తలెత్తితే అధికారులదే బాధ్యత!

**యాక్షన్ ప్లాన్‌తో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించాలి**

**మిషన్ భగీరథ అధికారుల సమీక్షలో కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశం**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):**
జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా లోపాలు లేని కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన త్రాగునీరు అందేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ (ఇంట్రా, గ్రిడ్), స్థానిక సంస్థల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్‌లో నీటి కొరత



ఏర్పడే అవకాశం ఉన్నందున అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
జిల్లాలోని 1,477 ఓవర్‌హెడ్ నీటి నిల్వ ట్యాంకులు, ఇతర ప్రత్యామ్నాయ నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి సరఫరా సక్రమంగా అందని గ్రామాలు, పట్టణ ప్రాంతాలను వెంటనే గుర్తించి, ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని సరఫరా చేసే ఏర్పాట్లు చేయాలన్నారు.
గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నీటి ఇబ్బందులు ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.
సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పీడీ పురుషోత్తం, మిషన్ భగీరథ ఈఈలు బి. మాణిక్యరావు, పుష్పలతతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 27,116కు వినాయక లడ్డూ కైవసం

### సింగిల్ విండో డైరెక్టర్ పుల్లూరి నర్సింగరావు



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో సింగిల్ విండో డైరెక్టర్ పుల్లూరి నర్సింగరావు రూ. 27,116కు లడ్డూను కైవసం చేసుకున్నారు. వేలంపాటలో ఉత్సాహంగా పాల్గొన్న నర్సింగరావు అత్యధిక ధరకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నానని తెలిపారు. ముగింపు రోజు నిర్వహించిన వేలంపాటలో రూ. 27,116కు లడ్డూ దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని, వినాయకుడి ఆశీస్సులతోనే లడ్డూ తనకు లభించిందని పేర్కొన్నారు.

గ్రామ సర్పంచ్ పుల్లూరి శ్రీధర్‌రావు మాట్లాడుతూ గణపతి ఉత్సవాలను గ్రామస్తుల సహకారంతో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడే ముద్దు

### మట్టి వినాయకుడి వద్ద ఘనంగా పూజలు.. మహా అన్నదానం

**స్టేషన్ ఘన్‌పూర్ /సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):**



పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడి ప్రతిమలే శ్రేయస్కరమని మున్సిపల్ కౌన్సిలర్ పొన్న రాజేష్ అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని చాగల్ 8వ వార్డులో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడి వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పొన్న రాజేష్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మట్టి వినాయకుడిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల నిమజ్జనంతో నీటి వనరులు కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలగని అనిల్, భక్తులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా గణనాథుని పూజా కార్యక్రమాలు



**తల్లాడ/సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పెద్ద సంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

శ్రీనగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలను నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండటంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జోనల్ సభ్యులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, తల్లాడ పట్టణ అధ్యక్షులు జివిఆర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్, యువ నాయకులు కటికి శ్రీకాంత్, రేగళ్ల నరసింహారావుతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# రైతాంగానికి అండగా ప్రజా ప్రభుత్వం

### సిరిపురం మేజర్ ద్వారా త్వరలోనే సాగునీరు -మంత్రి తుమ్మల హామీ



**తల్లాడ/సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** సిరిపురం మేజర్ కాల్వ ద్వారా త్వరలోనే సాగునీరు విడుదల చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. పంటలకు కీలక సమయంలో సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన స్వగ్రామమైన గండుగలపల్లిలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మర్సకట్ల బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తల్లాడ మండల రైతుల సాగునీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, సిరిపురం మేజర్ కాల్వ ద్వారా వీలైనంత త్వరగా నీరు విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించారు. వినతిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సిరిపురం మేజర్ కాల్వ నిర్మాణ పనులు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయని, పనులు కొనసాగుతున్న కారణంగానే సాగునీటి విడుదలలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. పనులు పూర్తికాగానే త్వరితగతిన సాగునీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రైతాంగానికి అండగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్ట రాజమ్మకు ఘన నివాళి

### చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబానికి అండగా నిలిచిన న్యాయవాదులు




**హసన్‌పర్తి/సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి మండలం 65వ డివిజన్ సుబ్బాయిపల్లె గ్రామానికి చెందిన పుట్ట రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు, ఎంఎస్పీ పార్టీ సీనియర్ నాయకులు, ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ తల్లి.

పుట్ట రాజమ్మ మృతివార్త తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, మాదిగ లాయర్ ఫెడరేషన్ నాయకులు, పలువురు న్యాయవాదులు సుబ్బాయిపల్లెకు చేరుకుని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుట్ట రవి మాదిగ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి తమ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరుపాక జయకర్ మాదిగ, మాదిగ లాయర్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు వీరదాస్ వెంకటరత్నం మాదిగ, ఎంఎల్‌టీ రాష్ట్ర కోఆర్డినేటర్ కొండపాక కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు మైదం జపాల్, హనుమకొండ జిల్లా బాధ్యులు మంత్రపురి రమేష్, ఎంఎల్‌టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు జూపాక వెంకటేశ్వర్లు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

అలాగే హసన్‌పర్తి సొసైటీ డైరెక్టర్ రామంచ ప్రభాకర్, హసన్‌పర్తి మీడియా పాయింట్ ఉపాధ్యక్షులు పోగుల రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఇరుగు పైడి మాదిగ, మడిపల్లి శ్యాంబాబు మాదిగ, ములుగు జిల్లా ఎంఎస్పీ అధ్యక్షులు, జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్ తదితరులు పాల్గొని పుట్ట రాజమ్మకు నివాళులర్పించారు.

# రైతులకు సౌర విద్యుత్‌తో కొత్త ఆదాయ బాట

### 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**స్టేషన్ ఘన్‌పూర్/ సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** రైతులు సంప్రదాయ వ్యవసాయానికే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల వైపు అడుగులు వేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. మండలంలోని రంగరాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో పీఎం కుసుమ్ పథకం కింద రైతు నెలమంచ అజయ్ రెడ్డి ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఆయన ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ సౌర విద్యుత్ ఉత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని తెలిపారు. సాగుకు అనుకూలత తక్కువగా ఉన్న భూములు, బంజరు భూములను సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే రైతులకు విద్యుత్ విక్రయం ద్వారా స్థిరమైన ప్రత్యామ్నాయ ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి తోడుగా సౌర విద్యుత్ ఉత్పత్తి రైతులకు ఆర్థికంగా బలాన్నిస్తుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి పెరగడానికి ఇలాంటి ప్రాజెక్టులు దోహదపడతాయని తెలిపారు. సాహసోపేతంగా ముందడుగు వేసి 2 మెగావాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన రైతు నెలమంచ అజయ్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, రంగరాయిగూడెం సర్పంచ్ జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, డీఈ సారయ్య, ఇప్పగూడెం సర్పంచ్ మందపురం రాణి అనిల్ గౌడ్, కోమటిగూడెం సర్పంచ్ పనికిర సోమేశ్వర్, నాయకులు బూర్ల శంకర్, నాగరబోయిన శ్రీరాములు, పల్లె రవి, కత్తుల మల్లయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శ

### బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలంలోని ఇటీవల మృతి చెందిన కుటుంబాలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పరామర్శించి, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. దామెర గ్రామంలో కదం నాగయ్య, చింతలపల్లి గ్రామంలో సుఖినె రాధమ్మ పార్థివదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాగయ్య, రాధమ్మ మృతిపట్ల మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్‌రావు, ఏఐసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు గోలి రాజేశ్వరరావు, కాదరి రాజేందర్, కోఆపరేటివ్ డైరెక్టర్ ఎం.రాములు, రాజయ్య, ముప్పు మహేందర్, బక్కి రామ్‌సింగ్, కదరి సుధీర్, సాతురి సదయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు పాటి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ఉమ్మగోని ప్రభాకర్ తదితరులు ఉన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల హక్కుల కోసం సెప్టెంబర్ 27న చలో యాదగిరిగుట్ట

### పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్.. -ఉద్యమకారులకు అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ పిలుపునిచ్చారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిమ్మల మనోహర్ మాట్లాడుతూ.. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడు కుటుంబానికి ఒక్కరు చొప్పున యాదగిరిగుట్టకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారుల డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ దివిటిలా నిలిచి సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హామీలతో పాటు ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన ఇంటి స్థలం, రెండు గుంటల భూమి తదితర అంశాల్లో ఉద్యమకారులకు న్యాయం జరగాల్సి ఉందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

**మంత్రి పొన్నంతో ఉద్యమకారుల భేటీ**

ఇటీవల మృతిచెందిన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్యమకారులు కలిసి తమ సమస్యలను వివరించారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో అందరం కలిసి పోరాడామని గుర్తుచేశారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సింగిల్ విండో అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, గోలి రాజేశ్వరరావుతో పాటు రాష్ట్ర నాయకులు నిమ్మల మనోహర్, మర్రి అమరేందర్, పుట్ట ప్రతాప్, జూపాక శ్రీనివాస్, మేకల రాజయ్య, వంగ రవి, మేకల రాజకుమారి, కమలాబాయి, రాధమ్మ, వజ్రమ్మ, భాగ్యమ్మ, విజ్జమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు



# ముస్లిం సోదరుడిని వరించిన గణనాథుని ప్రసాదం.



**బయ్యారం/,సెప్టెంబర్ 23.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని కొత్తపేట పంచాయతీకి చెందిన షేక్ రసూల్ అనే ముస్లిం సోదరుడు లక్కీ కూపన్ ద్వారా వినాయకుని లడ్డును గెలుచుకున్నారు.కొత్తపేట 'నాని యూత్' ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు లక్కీ డ్రా నిర్వహించగా,రసూల్ కొనుగోలు చేసిన కూపన్‌కు స్వామివారి లడ్డు దక్కింది.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు,నాని యూత్ ప్రతినిధులు గణపతి లడ్డును షేక్ రసూల్‌కు సగౌరవంగా అందజేశారు.లక్కీ డ్రాలో గణేశుని ప్రసాదం రావడం పట్ల రసూల్ కుటుంబ సభ్యులు జామున హర్షం వ్యక్తం చేశారు.ఈ సంఘటన గ్రామంలో సామరస్యతకు,సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచిందని భక్తులు అన్నారు.


# బయ్యారం శివాలయంలో సీఐ,తహసీల్దార్,సర్పంచ్‌లకు ఘన సన్మానం.



**బయ్యారం/,సెప్టెంబర్ 23.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల కేంద్రంలోని శివాలయంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి హాజరైన మండల అధికారులను,ప్రజాప్రతినిధులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.సన్మానం పొందిన వారిలో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్,బయ్యారం సీఐ రవీందర్,తహసీల్దార్ నాగరాజు,ఎస్ఐ ప్రశాంత్ బాబు,ఆర్ఐ సందీప్, ఉన్నారు.నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా,సజావుగా సాగేలా సహకరిస్తున్న అధికారులకు,ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలు బి.కుమారికి సర్పంచ్ చేతుల మీదుగా సన్మానం.

**బయ్యారం/,సెప్టెంబర్ 23:(జర్నలిస్ట్ వార్త)**
ఇటీవల బయ్యారం మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న బి.కుమారిని బుధవారం జగ్గుతండా పిఎస్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ బోల్లి జయంతి వెంకట కృష్ణ, హెచ్ఎం పద్మావతి, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గత 16 ఏళ్లుగా విద్యాబోధనలో



అంకితభావంతో పనిచేస్తూ,ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన కుమారి గారి సేవలను కొనియాడారు.బయ్యారం మండలంలో సుదీర్ఘకాలం సేవలందించి తల్లిదండ్రులు,అధికారుల మన్ననలు పొందిన ఆమెకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం అభినందనీయమన్నారు.

## ఆలిగేరు వద్ద కట్టుదిట్టమైన భద్రత నడుమ వినాయక నిమజ్జనాలు.

-సర్పంచ్ శాంతి కిషన్ నాయక్.



**బయ్యారం/,సెప్టెంబర్ 23(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం ఆలిగేరు బ్రిడ్జి వద్ద వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సమగ్ర ఏర్పాట్లు చేపట్టారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా అత్యవసర



వైద్య సేవలు,పోలీస్ బందోబస్తు,పవర్ సప్లై, గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని ఘటనా స్థలంలో అందుబాటులో ఉంచారు.ఈ ఏర్పాట్లను ఎంపీడీఓ దీపిక స్వయంగా పర్యవేక్షించి,అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.నిమజ్జనం సజావుగా సాగేందుకు అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# లైసెన్సు లేకుండా ఆహార పదార్థాల తయారీపై చర్యలు

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్న అధికారులు**

**వైరాలో నాసిరకం ఆహార పదార్థాల సరఫరాపై దుకాణదారుల ఫిర్యాదులు**

**వైరా/ సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** అనుమతులు, లైసెన్సులు లేకుండా ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించడం చట్టవిరుద్ధమని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు పొందిన యూనిట్లలోనే ఆహార పదార్థాల తయారీ, ప్యాకింగ్, విక్రయాలు జరగాలని స్పష్టం చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన గుర్తిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.వైరా మున్సిపాలిటీ పరిధిలో కొన్ని ప్రాంతాల నుంచి అప్పడాలు, బిస్కెట్లు తదితర ఆహార ఉత్పత్తులు తయారై చిల్లర దుకాణాలు, పాన్‌షాపులు, టీ దుకాణాలకు సరఫరా అవుతున్నాయంటూ కొందరు వ్యాపారులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కొన్ని ఉత్పత్తుల నాణ్యత, తయారీ వివరాలు, గడువు తేదీలపై అనుమానాలు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. అయితే ఆయా ఉత్పత్తుల్లో కల్తీ లేదా గడువు ముగిసిన పదార్థాలు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించిన అనంతరం మాత్రమే వాటి నాణ్యతపై తుది నిర్ధారణకు రావాల్సి ఉంటుంది.
వైరా కేంద్రంగా పరిసర ప్రాంతాలకు ఆహార ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయంటూ వస్తున్న ఫిర్యాదులపై అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తయారీ కేంద్రాల అనుమతులు, ఆహార భద్రతా లైసెన్సులు, ప్యాకింగ్‌పై తయారీదారు వివరాలు, తయారీ తేదీ, గడువు తేదీ తదితర అంశాలను పరిశీలించాలని కోరుతున్నారు.ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాల తయారీ, ప్యాకింగ్ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో నేతాజీ నగర్‌లో అన్నదాన కార్యక్రమం.




**బయ్యారం/,సెప్టెంబర్ 23.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల పరిధిలోని జగ్గుతండ గ్రామ పంచాయతీ నేతాజీ నగర్‌లో వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.దాతలు నాసర్ల లింగయ్య – రమణ దంపతుల సౌజన్యంతో ఈ అన్నదానాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ లోకంలో ఉన్న అన్ని దానాల కంటే అన్నదానం అత్యంత పవిత్రమైనదని కొనియాడారు.తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుని ఆశీస్సులు,అన్నదానంలో పాల్గొన్న ప్రతి ఒక్క భక్తుడిపై ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. అన్నదానాన్ని ఏర్పాటు చేసిన దాతల ఉదారతను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు,గ్రామ పెద్దలు,నేతాజీ నగర్ యూత్ సభ్యులు,మహిళలు,వినాయక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు బాటలో.. కల్లెడ పీఏసీఎస్



**పర్వతగిరి/సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ వార్త):**
పర్వతగిరి మండలం కల్లెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)కు పిన్నింటి అనిల్‌రావు నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. బుధవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన చైర్మన్‌గా ప్రమాణం చేశారు.



ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్ హాజరయ్యారు. నూతన చైర్మన్ అనిల్‌రావును శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.పీఏసీఎస్ ద్వారా రైతులకు అందే సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సహకార సంఘం కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టమ్మ కుటుంబ సభ్యులతో పిడమర్తి రవి ఆప్యాయ పలకరింపు



**తల్లాడ/సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు పిడమర్తి రవికి తల్లాడ మట్టమ్మ హోటల్ అధినేత సరికొండ రమణమ్మ కుటుంబ సభ్యులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. తల్లాడకు వచ్చిన పిడమర్తి రవిని నాగన్నతో కలిసి మట్టమ్మ కుటుంబ సభ్యులు ఆప్యాయంగా పలకరించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా కొనసాగుతున్న సోదరభావంతో పరస్పరం వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హోటల్‌లోని మహిళా సిబ్బంది కూడా పిడమర్తి రవికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిశెట్టి నాగన్న పాల్గొన్నారు.

# బాల్యతండాలో భక్తిశ్రద్ధలతో బొజ్జ గణపయ్య నిమజ్జనం.



**బయ్యారం/,సెప్టెంబర్ 23.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని బాల్యతండా గ్రామంలో వినాయక నిమజ్జన మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల జయజయధ్వానాల నృత్యాల నడుమ నిమజ్జన కార్యక్రమాన్ని ఉత్సాహంగా పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆంగోతు శ్రీకాంత్ నాయక్, బాల్యతండా సర్పంచ్ అజ్మీరా దేవోజీ నాయక్,భూక్యా రవి నాయక్, జరుపుల శ్రీను నాయక్,బోడ బాలునాయక్,మంత్రియా నాయక్,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొజ్జ గణపయ్య ఆశీస్సులు గ్రామానికి ఎల్లప్పుడూ ఉండి, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

# నేడు వర్ధన్నపేట పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**వర్ధన్నపేట/సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. వర్ధన్నపేటలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. నూతన చైర్మన్‌గా అబ్బిడి రాజిరెడ్డి, నూతన డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో రైతులకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరచడం, సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన సహకారం అందించడంపై దృష్టి సారించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# రిమ్స్ ఘటనలో మరో ఇద్దరు శిశువులు మృతి

**ఐదుకు చేరిన మృతుల సంఖ్య**

**ఆస్పత్రిని సందర్శించిన ప్రముఖులు**

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

**బీఆర్ఎస్ రూ.లక్ష ఆర్థిక సహాయం**

**టీఆర్ఎస్ అధ్యక్షులు కవిత రూ.50వేల చొప్పున అందజేత**




**ఆదిలాబాద్ (జర్నలిస్ట్ వార్త):**
ఆదిలాబాద్ రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో జరిగిన షార్ట్ సర్క్యూట్ ఘటనలో ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు శిశువులు పరిస్థితి విషమించి మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. బుధవారం పలువురు ప్రముఖులు ఆస్పత్రిని సందర్శించారు. రిమ్స్‌కు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత వచ్చారు. మృతి చెందిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు ఆమె రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ముగ్గురు చిన్నారుల కుటుంబాలకు మంగళవారం సాయంత్రమే సాయం అందజేయగా, మిగతా ఇద్దరు చిన్నారుల కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.
అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జన్సాన్ నాయక్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు రిమ్స్‌ను సందర్శించి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పసికందులు మృతి చెందారని ఆరోపించారు. మృతి చెందిన శిశువుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరపున రూ.లక్ష చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న వారికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న శిశువులకయ్యే మొత్తం వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, అవసరమైతే హైదరాబాద్‌కు తరలించి అత్యున్నత వైద్యం అందించాలని కోరారు

# కూచిపూడితో మెప్పించిన డింపుల్ హయాతి..

## తిరుమలలో ప్రత్యేక ప్రదర్శన!



టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సొషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ విశేషాలు చూద్దాం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. నెటిజన్ల ఆశ్చర్యం, ప్రశంసలు : ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సినిమా కెరీర్ మరియు క్రేజ్: తెలుగు, తమిళ సినిమాల్లో నటించి మంచి నటిగా పేరు తెచ్చుకున్న డింపుల్, వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంలో 'జర్రా జర్రా' స్పెషల్ సాంగ్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత ఖిలాడి, రామబాణం, అత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. 'ఆదర్శ కుటుంబం'తో త్వరలో ముందుకు: ప్రస్తుతం సరైన సినిమా బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న డింపుల్ హయాతి, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నట్టు టాక్. ఈ భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో ఆమెకు పెద్ద హిట్ అందుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇక అంతేగాక శర్వానంద్ 38వ సినిమా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఓ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.వెండితెరపై తన గ్లామర్, నటనతో ఆకట్టుకునే డింపుల్ హయాతి, తిరుమలలో ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో తనలోని సంప్రదాయ కళాత్మక కోణాన్ని ఆవిష్కరించారు. భక్తిభావంతో ఆమె చేసిన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరి మనసులను దోచుకోవడమే కాకుండా, ఆమె కెరీర్‌కు మరింత సానుకూలతను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు.

# ఇక మైత్రీ థియేటర్లలో 'సర్వపిండి'..


## సినిమా చూస్తూ కమ్మని రుచి.. 'ది ప్యారడైజ్'తో ఎంట్రీ!




ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ 'మైత్రీ' తమ థియేటర్ల ద్వారా ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సినిమా అనుభూతికి తెలంగాణ సంస్కృతిని, అచ్చమైన పల్లె రుచులను జోడిస్తూ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో తెలంగాణ సంప్రదాయ వంటకమైన 'సర్వపిండి'ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

తొలి దశలో భాగంగా మైత్రీ విమల్, మైత్రీ శివగంగ థియేటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో విరామంలో ప్రేక్షకులు ఈ కమ్మని సర్వపిండిని ఆస్వాదించవచ్చు. సినిమా చూస్తూనే, తెలంగాణ ప్రత్యేక వంటకాన్ని రుచి చూసే ఈ కొత్త అనుభవం సినీ ప్రియులను ఆకట్టుకుంటుందని సంస్థ భావిస్తోంది.ఈ సరికొత్త ఆలోచన వెనుక సోషల్ మీడియాలో ప్రజాదరణ పొందిన 'బామ్మాస్టోరిస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ కృషి ఉంది. ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో ఆమె ప్రేమతో తయారు చేసే సర్వపిండి, ఇప్పుడు ఏకంగా బిగ్ స్క్రీన్ ప్రేక్షకులకు చేరువ కావడం విశేషం. వెండితెరపై దృశ్యాలను ఆస్వాదిస్తూనే, తెలంగాణ అసలైన రుచిని అందించాలన్న మైత్రీ థియేటర్స్ ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.



# తెలుగు ఇండస్ట్రీని చూసి కన్నీళ్లొచ్చాయి : 'ది ప్యారడైజ్' నటుడు రాఘవ్ జుయల్

ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు.

ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'క్రాక్‌రాక్స్' అనే స్టేజ్ పేరుతో తన స్లో-మోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత 'డ్యాన్స్ ప్లస్' వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు.

# 'ప్యారడైజ్'లో నాని 'జడల్' పాత్రకు స్ఫూర్తి ఈ ఫొటోనే!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన తాజా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం రేపు (సెప్టెంబరు 24) విడుదల కానున్న నేపథ్యంలో, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాలోని కీలకమైన 'జడల్' పాత్రకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ పాత్రకు, ముఖ్యంగా నాని జడల లుక్‌కు తన చిన్ననాటి జ్ఞాపకాలే స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియాలో తన చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "జడల్ పుట్టుక, యుద్ధం కల్పితం కావచ్చు... కానీ అతని జడలు, లుక్ నా చిన్నప్పటి స్ఫూర్తితో వచ్చినవే. అమ్మ నాకు 5, 6 ఏళ్ల వయసు వరకు జడలు వేసి కట్టేవారు. నేను పెద్దయ్యాక, కమర్షియల్ సినిమాలో ఒక హీరో జడలతో 70ఎమ్ఎమ్ స్క్రీన్‌పై ఎలా ఉంటాడా అని ఎప్పుడూ ఊహించుకునేవాడిని. ఇప్పుడు నా హీరో నాని అన్నను జడల్‌గా మీ ముందు ఉంచుతున్నాను. ఈ చిత్రం కేవలం నా చిన్నతనం కాదు, నా ప్యారడైజ్" అని ఆయన పేర్కొన్నారు.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు పంచుకున్న ఈ వ్యక్తిగత విషయం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.

# నంది అవార్డుల కోసం దరఖాస్తు విధానం- మార్గదర్శకాలు!






ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ - నాటకరంగ అభివృద్ధి సంస్థ (విజయవాడ) 2025 సంవత్సరానికి సంబంధించిన -చలనచిత్ర నంది బహుమతులు - 2025- , ుఎ నంది బహుమతులు - 2025- కోసం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను, టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పురస్కారాలను అందజేస్తోంది. అర్హులైన నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల నుండి దరఖాస్తులను సంస్థ ఆహ్వానించింది. చలనచిత్ర విభాగంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది చలనచిత్ర నిబంధనలను అనుసరించి 2025 సంవత్సరానికి ఉత్తమ ఫిల్మ్ నిర్మాతలు, ఉత్తమ కళాకారులు.. ఉత్తమ సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషలో భారతదేశంలో ఎక్కడైనా నిర్మించి.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ -సీబీఎఫ్‌సీ ద్వారా థియేటర్లలో ప్రదర్శించిన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యాసంబంధమైన చిత్రాలు అలాగే తెలుగు సినిమా మీద వచ్చిన పుస్తక రచనలు, రచయితలు, నిర్మాతలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ఇక టెలివిజన్ రంగానికి సంబంధించి 2025 సంవత్సరానికి నంది టి.వి. చిత్ర నిబంధనల ప్రకారం ఉత్తమ టి.వి. చిత్ర నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించనున్నారు. టెలిఫిల్మ్, టి.వి. ఫీచర్స్, టి.వి. మెగాసీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సామాజిక అంశాలు, విద్య సంబంధిత చిత్రాల రూపకర్తలు ఈ బహుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవార్డులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు.. ఇతర వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ **www.apsftvdc.in** ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పొందుపరుచుటకు చివరి తేదీగా 12.10.2026ను నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల ప్రింట్ ప్రతులను సంబంధిత డాక్యుమెంట్లతో జతపరిచి నిర్దేశిత గడువులోగా అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను -మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ, 4వ అంతస్తు, ఎన్.టి.ఆర్. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిత్ నెహ్రూ బస్ కాంప్లెక్స్, విజయవాడ - 520013- చిరునామాకు పంపడానికి చివరి తేదీ 16.10.2026గా ఖరారు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఐ.ఏ.ఎస్., తెలిపారు. కళాకారులు - నిర్మాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.